కచ్చిత అంచనాలు.. కాపాడే సూచనలు

ప్రజలు, రైతుల సేవలో 150 ఏండ్లు పూర్తి చేసుకొన్న ఐఎండీ

ప్రపంచంలోనే మూడో అత్యున్నత వాతావరణ సంస్థగా గుర్తింపు • విపత్తుల సమయంలో ఆస్తి, ప్రాణ నష్టం తగ్గించడంలో విశేష కృషి

హైదరాబాద్‌లోని ఐఎండీ డాప్లర్ వెదర్ రాడార్

న్యూఢిల్లీ, జనవరి 13(నమస్తే తెలంగాణ): భారతీయులకు చిర కాలంగా వాతావరణ వార్తలు తెలియజేస్తూ, ప్రకృతి విపత్తులపై అప్రమత్తం చేస్తున్న భారత వాతావరణ విభాగం(ఐఎండీ) ప్రస్థానం కీలక మైలురాయికి చేరింది. రైతులకు, ప్రజలకు ఎంతో సేవ చేస్తున్న ఈ విభాగం ఈ నెల 15న 149 ఏండ్ల ప్రస్థానాన్ని పూర్తి చేసుకొని 150 ఏండ్లలోకి అడుగు పెడుతున్నది. 1875 జనవరి 15న చిన్న సంస్థగా ప్రారంభమైన ఐఎండీ అంచెలంచెలుగా ఎదుగుతూ నేడు ఒక విశాల వృక్షంలా మారింది. ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకొని వాతావరణ పరిస్థితులను కచ్చితత్వంతో అంచనా వేయడంలో ప్రపంచంలోనే మూడో అత్యున్నత వాతావరణ విభాగంగా గుర్తింపు పొందింది. ఐఎండీ అందిస్తున్న సేవలు, సమాచారం వల్ల మన దేశంలో విపత్తుల సమయంలో ఆస్తి, ప్రాణ నష్టాన్ని గణనీయంగా తగ్గుతున్నది.

నాడు కొన్ని వర్ష కొలమానాలు.. నేడు విదేశాలకూ సేవలు

దేశంలో 1864లో సంభవించిన తీవ్రమైన తుఫాను, 1866, 1871లో తీవ్రమైన విపత్తులు సంభవించాయి. ఈ నేపథ్యంలో వాతావరణ పరిస్థితులను ముందుగా అంచనా వేయడం ద్వారా ఆస్తి, ప్రాణనష్టాన్ని అరికట్టేందుకు నాడు భారత్‌లోని బ్రిటీష్ ప్రభుత్వం ఐఎండీని స్థాపించింది. నాడు కేవలం కొన్ని వర్ష కొలమాన పరికరాలే ఐఎండీ దగ్గర ఉండేవి. కాలక్రమంలో ఆధునిక సాంకేతికతను ఐఎండీ అందిపుచ్చుకుంది. ఐఎండీ 2023 నివేదిక ప్రకారం ఐఎండీ 39 డాప్లర్ వెదర్ రాడార్స్, 15 నిమిషాలకోసారి వివరాలు అందించే ఇన్‌షాట్స్ 3డీఆర్ శాటిలైట్స్, 806 ఆటోమేటిక్ వెదర్ స్టేషన్స్, 200 ఆగ్రో ఆటోమేటిక్ వెదర్ స్టేషన్స్, 5896 వర్ష నిర్వహణ కేంద్రాలు, 63 పైలట్ బెలూన్ స్టేషన్లను కలిగి ఉంది. 150 ఏండ్ల ప్రస్థానంలో ఐఎండీ కీలకమైన పురోగతిని సాధించింది. తీవ్రమైన వాతావరణ పరిస్థితులను, నిర్దిష్టంగా ఒక గ్రామంలో పడే వర్షపాతం తీరును త్వరితగతిన తెలిపే టెక్నాలజీ, అత్యాధునిక ఉపగ్రహ వ్యవస్థలను సమకూర్చుకుంది. రాగల కొన్ని గంటలతో పాటు మొత్తం సీజన్‌లో పరిస్థితులను అంచనా వేయగలిగే సాంకేతికతను 2016 నుంచి 2021 మధ్య అందుబాటులోకి తీసుకొచ్చింది. వాతావరణ పరిస్థితులను కచ్చితత్వంతో అంచనా వేయడంలో ప్రపంచంలోనే భారత వాతావరణ విభాగం మూడో స్థానంలో నిలిచింది. భారత వాతావరణ విభాగం హిందూమహాసముద్రతీరంలోని 13 దేశాలతో పాటు, సార్క్ దేశాలకు వాతావరణ సేవలు అందిస్తున్నది. నేపాల్, మాల్దీవులు, శ్రీలంక, బంగ్లాదేశ్, మారిషస్‌కు ముందస్తు హెచ్చరికలు చేయడం ద్వారా విపత్తుల నుంచి ఆస్తి, ప్రాణ నష్టం తగ్గించేందుకు దోహదపడుతున్నది. ఐఎండీ ఆధ్వర్యంలో మిషన్ మౌసమ్ ద్వారా వాతావరణ పరిస్థితులను మరింత కచ్చితత్వంతో అంచనా వేస్తున్నది. ఇటీవల కృత్రిమ మేధను కూడా ఐఎండీ ఉపయోగించుకుంటున్నది. మౌసమ్ మిషన్‌లో భాగంగా ప్రత్యేక ప్రయోగశాలను ఏర్పాటు చేశారు. ఇందులో కృత్రిమంగా వాతావరణ పరిస్థితులను సృష్టించారు. ఎలాంటి వాతావరణ పరిస్థితులనైనా ఎదుర్కొనేందుకు వీలుగా అప్రమత్తం చేయడమే ఐఎండీ దీర్ఘకాలిక లక్ష్యమని భూ విజ్ఞాన శాఖ కార్యదర్శి రవిచంద్రన్ తెలిపారు.

వృద్ధికి, ఆర్థిక క్రమశిక్షణకు కీలకం

- ఆర్థిక ఏకీకరణను కొనసాగించవచ్చు
- కేంద్ర బడ్జెట్‌పై గోల్డ్‌మన్ శాచ్స్ సంస్థ నివేదిక

న్యూఢిల్లీ, జనవరి 13: రానున్న ఆర్థిక సంవత్సరం కోసం ప్రవేశపెట్టనున్న కేంద్ర బడ్జెట్ భారత్‌కు అత్యంత కీలకమని గోల్డ్‌మన్ శాచ్స్ నివేదిక అభిప్రాయపడింది. ఇతర అభివృద్ధి చెందుతున్న దేశాలతో పోలిస్తే భారత్‌లో ప్రజా రుణాలు, ద్రవ్య లోటు అధికంగా ఉన్నందున సమతుల వృద్ధి, ఆర్థిక క్రమశిక్షణ కోసం ఈ బడ్జెట్ ముఖ్యమైనదని పేర్కొన్నది. రుణాలు – జీడీపీ నిష్పత్తులు పాటించేందుకు గానూ ద్రవ్య లోటును తగ్గించేందుకు కేంద్ర ప్రభుత్వం ఆర్థిక ఏకీకరణ విధానాన్ని కొనసాగించవచ్చని అభిప్రాయపడింది. అయితే, ఈ కఠినమైన చర్య రానున్న ఆర్థిక సంవత్సరంలో ఆర్థిక వృద్ధికి ప్రతిబంధకంగా మారవచ్చని పేర్కొన్నది. కాగా, 2025-26 ఆర్థిక సంవత్సరానికి గాను ఫిబ్రవరి 1న కేంద్రం బడ్జెట్‌ను ప్రవేశపెట్టనుంది. ప్రస్తుతం జీడీపీలో 4.9 శాతంగా ఉన్న ద్రవ్య లోటును 4.5 శాతానికి తగ్గించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్టు ఇటీవల కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రకటించారు.

'భక్తి' జన సంద్రం

- పౌర్ణమి వేళ 144 ఏండ్ల తర్వాత ఘనంగా మహా కుంభ్
- త్రివేణి సంగమంలో 1.6 కోట్ల మంది పుణ్య స్నానాలు
- విదేశీయులూ రాక.. ప్రతి ఒక్కరూ పాల్గొనాలని పిలుపు

ప్రయాగ్‌రాజ్: ప్రపంచంలోనే అతి పెద్ద ఆధ్యాత్మిక ఉత్సవంగా పేరు గాంచిన మహా కుంభ మేళా 144 ఏండ్ల తర్వాత సోమవారం అత్యంత వైభవంగా ప్రారంభమైంది. తొలి రోజైన పుష్య మాస పౌర్ణమినాడు ఉత్తర ప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌కు భక్తులు పోటెత్తారు. గంగ, యమున, సరస్వతి నదుల సంగమ ప్రదేశంలో మొదటి రోజే 1.6 కోట్ల మంది పవిత్ర స్నానాలు చేసి ఉంటారని అంచనా వేస్తున్నారు. తెల్లవారుజాము నుంచే భక్తుల పూజలతో స్నాన ఘట్టాల ప్రాంతమంతా భక్తుల దైవ నామస్మరణలతో మారుమోగింది. మహా కుంభ్ ప్రారంభోత్సవం సందర్భంగా భారతీయ సంస్కృతి, విలువలను గౌరవించే కోట్లాది మందికి ఇది అత్యంత ప్రత్యేకమైన రోజు అని ప్రధాని నరేంద్ర మోదీ ఎక్స్ వేదికగా పేర్కొన్నారు. భక్తి, విశ్వాసం, సంప్రదాయాలు అనేక మందిని ఒక చోట చేర్చాయన్నారు. మన దేశ ఆధ్యాత్మిక వారసత్వాన్ని ఈ వేడుక ప్రతిబింబిస్తుందని చెప్పారు. మహా కుంభ మేళాలో విదేశీయులు కూడా పవిత్ర స్నానాలు చేశారు.

కట్టుదిట్టమైన భద్రత

నదిలో దిగి పవిత్ర స్నానాలు చేసే భక్తులకు నిరంతరం భద్రత కల్పించేందుకు నీటిలో తేలియాడే పోలీస్ స్టేషన్‌ను ఏర్పాటు చేశారు. అంతే కాకుండా చిన్న పడవలపై పోలీసులు ఎల్లవేళలా పహారా కాస్తున్నారు. ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందాలు, యూపీ పోలీసులకు చెందిన వాటర్ పోలీసు యూనిట్లు విధులు నిర్వహిస్తున్నాయి.మహా కుంభ మేళా ప్రారంభం రోజున పవిత్ర స్నానాలను ఆచరించిన సాధు, సంతులు, భక్తులకు ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ ధన్యవాదాలు తెలిపారు. తొలి రోజున కోటిన్నర మంది భక్తులు పవిత్ర స్నానాలు చేశారని ఎక్స్ వేదికగా ఆయన ప్రకటించారు.

తప్పిపోయి..తిరిగి చెంతకు చేరి

పవిత్ర స్నానాల కోసం భారీగా భక్తులు తరలిరావడంతో, సుమారు 250 మంది తమ కుటుంబ సభ్యుల నుంచి వేరైపోయారు. పోలీసులు, సివిల్ డిఫెన్స్ సిబ్బంది చురుగ్గా స్పందించడంతో వీరంతా తిరిగి తమ కుటుంబ సభ్యులను కలుసుకున్నారని అధికారులు చెప్పారు.

ఎక్కడ ఉన్నారో తెలిపే క్యూఆర్ కోడ్

ఈ మేళాలోని 25 సెక్టార్లలో ఉన్న విద్యుత్తు స్తంభాలపై 50 వేలకుపైగా క్యూఆర్ కోడ్‌లను ఏర్పాటు చేశారు. భక్తులు తాము ఏ ప్రదేశంలో ఉన్నామో తెలుసుకునేందుకు ఇవి ఉపయోగపడతాయి. కుంభ మేళాను గగనతలం నుంచి వీక్షించేందుకు హెలికాప్టర్ జాయ్‌రైడ్‌ను ఏర్పాటు చేశారు. టిక్కెట్ ధర ఒక్కొక్క వ్యక్తికి రూ.1,296గా నిర్ణయించారు.

ములాయం విగ్రహంపై ఆగ్రహం

మాజీ సీఎం ములాయం సింగ్ యాదవ్ విగ్రహాన్ని యులాయం సింగ్ యాదవ్ స్మృతి సేవా సంస్థాన్ మహా కుంభ మేళాలోని సెక్టర్ 16లో ఏర్పాటు చేసింది. అయితే దీనిపై సాధువుల నుంచి విమర్శలు వస్తున్నాయి.

యూపీకి డబ్బే డబ్బు!

మహా కుంభ మేళా ఉత్తర ప్రదేశ్‌కు కనకవర్షం కురిపిస్తున్నది. 45 రోజుల పాటు జరిగే ఈ మేళాకు 45 కోట్ల మంది భక్తులు హాజరవుతారని అంచనా. అయితే 40 కోట్ల మంది మాత్రమే వచ్చి, సగటున రూ.5,000 ఖర్చు చేస్తే, రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు రూ.2 లక్షల కోట్లు సమకూరుతాయని సమాచారం.

డిస్కంలు ప్రైవేటుపరం

రెండు కంపెనీలకు యూపీ ప్రభుత్వం టెండర్లు

లక్నో, జనవరి 13: విద్యుత్ పంపణీ సంస్థల్లో ప్రైవేటు భాగస్వామ్యాన్ని తీసుకురావాలని ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలోని దక్షిణాంచల్ విద్యుత్ వితరణ్ నిగమ్, పూర్వాంచల్ విద్యుత్ వితరణ్ నిగమ్ సంస్థలల్లో భాగస్వామ్యం చేపట్టేందుకు లేదా పూర్తిగా నిర్వహించేందుకు ప్రైవేటు సంస్థలను ఆహ్వానిస్తూ యూపీలోని బీజేపీ ప్రభుత్వం ఆదివారం టెండర్లను ఆహ్వానించింది. ఈ రెండు సంస్థలు కలిసి యూపీలోని 21 జిల్లాలకు విద్యుత్తును సరఫరా చేస్తున్నాయి. కాలం చెల్లిన విద్యుత్ సరఫరా వ్యవస్థలు, తరచూ విద్యుత్ కోతల కారణంగా ఈ సంస్థలు నష్టాల్లో ఉన్నందునే ప్రభుత్వం ప్రైవేటుపరం చేయాలని నిర్ణయించినట్టు తెలుస్తున్నది. కాగా, ఇప్పటికే న్యూఢిల్లీతో పాటు ఒడిశాలో విద్యుత్ సరఫరా రంగంలోకి ప్రైవేటు సంస్థలు ప్రవేశించాయి.

15న జరగాల్సిన నెట్ పరీక్ష వాయిదా

న్యూఢిల్లీ, జనవరి 13: యూజీసీ-నెట్ డిసెంబర్ 2024 షెడ్యూల్‌లో భాగంగా జరుగుతున్న నేషనల్ ఎలిజిబిలిటీ టెస్ట్(నెట్) పరీక్షల తేదీల్లో స్వల్ప మార్పు చేసినట్టు నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టీఏ) ప్రకటించింది. షెడ్యూల్ ప్రకారం జనవరి 3న ప్రారంభమైన ఈ పరీక్షలు జనవరి 16వ తేదీ వరకు జరగనున్నాయి. అయితే సంక్రాంతి పండుగ నేపథ్యంలో అభ్యర్థుల నుంచి వచ్చిన విజ్ఞప్తుల మేరకు ఈ నెల 15న జరగాల్సిన పరీక్షను వాయిదా వేస్తున్నట్టు ఎన్‌టీఏ సోమవారం వెల్లడించింది. ఈ పరీక్ష నిర్వహించనున్న తేదీని త్వరలోనే ప్రకటిస్తామని తెలిపింది. జనవరి 16న జరగాల్సిన పరీక్ష మాత్రం యథావిధిగా అదే రోజున జరగనున్నట్టు ప్రకటించింది.

సీఏ పరీక్షల షెడ్యూల్ విడుదల

మార్చి 1 నుంచి దరఖాస్తులు

న్యూఢిల్లీ, జనవరి 13: సీఏ మే 2025 పరీక్షల షెడ్యూల్‌ను ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ చార్టర్డ్ అకౌంటంట్స్ ఆఫ్ ఇండియా(ఐసీఏఐ) ప్రకటించింది. మే 15 నుంచి మే 21 వరకు సీఏ ఫౌండేషన్ పరీక్షలు జరగనున్నాయి. మే 3వ తేదీ నుంచి 14 వరకు సీఏ ఇంటర్మీడియట్ పరీక్షలు నిర్వహించనున్నారు. మే 2వ తేదీ నుంచి 13 వరకు సీఏ తుది(ఫైనల్) పరీక్షలు జరుగుతాయి. ఫౌండేషన్, ఇంటర్మీడియట్, ఫైనల్ పరీక్షల కోసం అభ్యర్థులు అందరూ https://eservices.icai.org పోర్టల్‌లో దరఖాస్తు చేసుకొని, ఫీజు చెల్లించాలని ఐసీఏఐ తెలిపింది. దరఖాస్తు ప్రక్రియ మార్చి 1వ తేదీ నుంచి ప్రారంభమవుతుందని, ఆలస్య రుసుము లేకుండా మార్చి 14 వరకు దరఖాస్తు చేసుకోవచ్చని వెల్లడించింది. రూ.600 ఆలస్య రుసుముతో మార్చి 17 వరకు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపింది.

బంగ్లా దౌత్యవేత్తతో కేంద్రం భేటీ

సరిహద్దు ఉద్రిక్తతలపై చర్చ

న్యూఢిల్లీ, జనవరి 13: ఉభయ దేశాల మధ్య పెరుగుతున్న ఉద్రిక్తతలపై చర్చించేందుకు బంగ్లాదేశ్ డిప్యూటీ హైకమిషనర్‌ను కేంద్ర విదేశాంగ శాఖ సోమవారం పిలిపించింది. కాగా, 4,156 కిలోమీటర్ల పొడవైన భారత్-బంగ్లాదేశ్ సరిహద్దులో ఐదు ముఖ్యమైన ప్రదేశాలలో కంచె నిర్మాణానికి భారత్ ప్రయత్నిస్తున్నట్టు బంగ్లాదేశ్ ఇటీవల ఆరోపించింది. ఈ నేపథ్యంలో దీనిపై చర్చించేందుకు ఢాకాలోని భారత హైకమిషనర్ ప్రణయ్ వర్మను బంగ్లాదేశ్ విదేశాంగ శాఖ ఆదివారం పిలిపించి చర్చలు జరిపింది. చారిత్రకంగా భారత్-బంగ్లాదేశ్ సంబంధాలు సుస్థిరంగా ఉన్నప్పటికీ విద్యార్థుల నిరసనల వల్ల బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనా ఆ దేశాన్ని వదిలి భారత్‌లో ఆశ్రయాన్ని పొందిన నాటి నుంచి ఉభయ దేశాల మధ్య సంబంధాలు దెబ్బతిన్నాయి.

జపాన్‌లో భూకంపం

రిక్టర్ స్కేలుపై 6.9 తీవ్రత

టోక్యో, జనవరి 13: వాయువ్య జపాన్‌లోని క్యూషూ ద్వీపంలో సోమవారం భూకంపం సంభవించింది. దీని తీవ్రత రిక్టర్ స్కేలుపై 6.9గా నమోదైంది. స్థానిక కాలమానం ఉదయం 9.29 గంటలకు మియాజకీ ప్రాంతంలో భూకంపం సంభవించినట్టు జపాన్ వాతావరణ శాఖ తెలిపింది. భూమిలోపల 37 కిలోమీటర్ల లోతులో భూప్రకంపనలు ఏర్పడినట్టు యూరోపియన్ మెడిటెర్రానియన్ సీస్మాలాజికల్ సెంటర్(ఈఎంఎస్‌సీ) తెలిపింది. గత ఏడాది రెండు శక్తివంతమైన భూకంపాలు సంభవించాయి.

సౌదీతో హజ్ ఒప్పందం ఖరారు

భారత్ కోటాలో 1.75 లక్షల యాత్రికులు

న్యూఢిల్లీ, జవనరి 13: సౌదీ అరేబియాతో హజ్ ఒప్పందంపై భారత్ సోమవారం సంతకం చేసింది. ఈ ఏడాది భారత్ నుంచి 1,75,028 మంది యాత్రికులు హజ్‌కు వెళ్లడంపై రెండు దేశాల మధ్య ఒప్పందం కుదిరింది. కేంద్ర మైనారిటీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు, సౌదీ అరేబియాకు చెందిన హజ్, ఉమ్రా మంత్రి థౌఫిఖ్ బీన ఫౌజాన్ అల్ రబయ్యా జెడ్డాలో ఈ ఒప్పందంపై సంతకాలు చేశారు. సౌదీ అరేబియాతో హజ్ ఒప్పందం 2025పై సంతకం చేసినట్టు రిజిజు ఎక్స్ వేదికగా ప్రకటించారు. హజ్ 2025 కోసం భారత్ కోటాగా 1,75,025 మంది యాత్రికులను ఖరారు చేసినట్టు ఆయన తెలిపారు. మన దేశ హజ్ యాత్రికులు అందరికీ అత్యుత్తమ సేవలు అందచేయడానికి కట్టుబడి ఉన్నామని ఆయన తెలిపారు. కాగా, ఈ ఒప్పందంపై ప్రధాని నరేంద్ర మోదీ స్పందిస్తూ ఈ ఒప్పందాన్ని స్వాగతిస్తున్నామని ప్రకటించారు.

సంక్రాంతి వేడుకల్లో ప్రధాని మోదీ

కేంద్రమంత్రి కిషన్ రెడ్డి నివాసంలో హాజరు

హైదరాబాద్, జనవరి 13 (నమస్తే తెలంగాణ): కేంద్ర మంత్రి జీ కిషన్ రెడ్డి సోమవారం ఢిల్లీలోని తన నివాసంలో సంక్రాంతి వేడుకలను నిర్వహించగా ముఖ్య అతిథిగా ప్రధాన మంత్రి నరేంద్రమోదీ హాజరుఐ తెలుగు ప్రజలందరికీ సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. సినీ నటుడు చిరంజీవి, గాయని సునీత, కేంద్ర మంత్రులు, ఢిల్లీలో పనిచేస్తున్న వివిధ రాష్ట్రాల కేడర్ల తెలుగు అధికారులు పాల్గొన్నారు.

'నోట్ల కట్ట' ఘటన నైతికతకు సవాల్

- రాజ్యసభలో దొరికిన నగదు తమదంటూ ఎవరూ తీసుకెళ్లలేదు
- ఉపరాష్ట్రపతి ధన్‌ఖడ్ ప్రకటన
- ఇష్టం లేకున్నా పార్టీలు చెప్పినట్టు ఎంపీలు ప్రవర్తిస్తున్నారని ఆవేదన

న్యూఢిల్లీ, జనవరి 13: రాజ్యసభలో ఓ ఎంపీ సీటు కింద దొరికిన నోట్ల కట్ట తమదే నంటూ ఎవరూ తన చాంబర్‌కు వచ్చి అడగకపోవడం బాధగా ఉందని రాజ్యసభ చైర్మన్ జగ్‌దీప్ ధన్‌ఖడ్ ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం నాడిక్కడ ఒక పుస్తకావిష్కరణ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ మన నైతిక ప్రమాణాలకు ఇది సమష్టి సవాల్ అని ఆయన వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ సభ్యుడు అభిషేక్ సింఘ్వీకి కేటాయించిన సీటు కింద రూ.500 నోట్ల కట్ట ఒకటి పార్లమెంట్ శీతాకాల సమావేశాల సందర్భంగా డిసెంబర్ 6న దొరికింది. ఈ అంశం రాజ్యసభను కుదిపేసింది. అధికార, ప్రతిపక్ష సభ్యులు పరస్పరం ఆరోపణలు చేసుకోగా, దీనిపై దర్యాప్తు జరిపించాలని కాంగ్రెస్ సభ్యుడు సింఘ్వీ డిమాండు చేశారు. ఈ ఘటనను తీవ్రమైన విషయంగా అభివర్ణించిన ధన్‌ఖడ్ అవసరార్థం ఎవరైనా కరెన్సీ నోట్లు తీసుకెళ్లడం తప్పేమీ కాదని, కాని అవి తమవేనంటూ ఎవరూ అడగకపోవడం బాధాకరమని అన్నారు. సభ్యుల నైతిక విలువలకు సంబంధించి ఎథిక్స్ కమిటీ చాలా కాలం లేదని, 1990 దశకం చివరిలో రాజ్యసభలో ఎథిక్స్ కమిటీ ఏర్పడిందని ఆయన చెప్పారు. రాజ్యసభకు సభ్యులుగా వచ్చే వ్యక్తులు వివిధ రంగాలలో నిష్ణాతులు, అనుభవజ్ఞులని, అయితే ఎవరి మార్గదర్శకత్వంలోనే వారు పనిచేయాల్సి వస్తోందని ఆయన వ్యాఖ్యానించారు. సభలో గందరగోళ వాతావరణాన్ని సృష్టించడం వారిలో కొందరికి ఇష్టం లేనప్పటికీ ఆయా పార్టీల ఆదేశాల మేరకు పని చేయక తప్పడం లేదని ఆయన అన్నారు.

అక్షరాస్యతతోనే ఎన్నికల చైతన్యం

- విద్య, ఉపాధి, సాధికారతలో మహిళలకు ప్రాధాన్యత అవసరం
- మహిళల ఓటింగ్‌పై ఎస్‌బీఐ నివేదిక

న్యూఢిల్లీ, జవనరి 13: దేశంలో ఒక శాతం అక్షరాస్యత పెరిగితే అది 25 శాతం మహిళా ఓటర్లు, వారి ఓటింగ్ శాతం పెరుగుదలకు దారి తీస్తుందని భారత స్టేట్ బ్యాంక్(ఎస్‌బీఐ) ఓ నివేదికలో వెల్లడించింది. దేశంలో అక్షరాస్యత, మహిళా ఓటర్ల పెరుగుదలకు మధ్య సంబంధం ఉందని నివేదిక పేర్కొంది. 2019 సార్వత్రిక ఎన్నికలతో పోలిస్తే 2024 ఎన్నికలలో మహిళా ఓటర్ల సంఖ్య 1.8 కోట్లు పెరిగిందని, వీరిలో 45 లక్షల మంది ఓటర్ల పెంపునకు అక్షరాస్యత మెరుగుదలే కారణమని నివేదిక తెలిపింది. మహిళా ఓటర్ల పెంపుదలకు అక్షరాస్యతతోపాటు ఉపాధి, ఇంటి యాజమాన్యహక్కు వంటి అంశాలు కూడా చాలా ముఖ్యమైన కారణాలని నివేదిక పేర్కొంది. ప్రధాన మంత్రి ముద్ర యోజన వంటి ఉపాధి పథకాలు 36 లక్షల మంది అదనపు మహిళా ఓటర్లను కల్పించడంలో కీలక పాత్ర పోషించాయని నివేదిక తెలిపింది. పారిశుధ్య సౌకర్యాల కల్పన కారణంగా 21 లక్షల అదనపు మహిళలు ఓటర్లుగా రిజిస్టర్ అయినట్టు నివేదిక తెలిపింది.

కాబోయే కోడలే భార్య అయ్యింది!

- నాసిక్‌లో ఓ వధువును ప్రేమించి పెండ్లి చేసుకున్న వరుడి తండ్రి
- జీవితంపై విరక్తి చెంది సన్యాసిగా మారాలని తనయుడి నిర్ణయం

ముంబై, (నమస్తే తెలంగాణ): ఒకరిని పెండ్లాడాల్సిన వధువు మరొకరిని పెండ్లి చేసుకోవడం అక్కడక్కడా చూస్తుంటాం. కాని.. కుమారుడు పెళ్లి చేసుకోవాలనుకున్న అమ్మాయిని అతడి తండ్రి పెండ్లి చేసుకోవడం అరుదుగా చూస్తుంటాం. మహారాష్ట్రలోని నాసిక్‌లో అలాంటి షాకింగ్ సంఘటన జరిగింది. స్థానికుల కథనం ప్రకారం ఓ తండ్రి తన కొడుకు కోసం ఒక అమ్మాయిని చూశాడు. పెళ్లి తేదీ కూడా ఖరారైంది. ఇద్దరి ఇండ్లలో పెండ్లి ఏర్పాట్లు జోరుగా సాగుతున్నాయి. అయితే, కాబోయే కోడలితో ఎప్పుడు ప్రేమలో పడ్డారో తెలియదు కాని ముహూర్తం చూడకుండా, కుటుంబసభ్యులకు చెప్పకుండా అబ్బాయి తండ్రి తనకు కోడలు కావాల్సిన అమ్మాయిని గుడిలో పెళ్లి చేసుకొని నేరుగా ఇంటికి తీసుకువచ్చాడు. పెళ్లి దుస్తుల్లో వచ్చిన ఆ కొత్త జంటను చూసి యువకుడు నిర్ఘాంతపోయాడు. భార్య కావాల్సిన యువతి చేసిన మోసానికి, తండ్రి చేసిన ద్రోహానికి జీవితంపై విరక్తి పెంచుకున్నాడు. మరో అమ్మాయిని వెతికి తెచ్చి పెళ్లి చేస్తామని తండ్రి హామీ ఇచ్చినా ప్రేమ, పెండ్లిపై నమ్మకం పోయిందని ఆవేదన చెందాడు. ఇక సన్యాసిగా మారుతానని భీష్మించుకుని కూర్చున్నాడు.

రోడ్డు ప్రమాద బాధితులను

రక్షిస్తే 25 వేలు

ప్రోత్సాహకాన్ని ఐదింతలు పెంచిన కేంద్రం

నాగ్‌పూర్, జనవరి 13: రోడ్డు ప్రమాదం జరిగినప్పుడు వెంటనే స్పందించి బాధితులను దవాఖానలకు తరలించి, ప్రాణాలను కాపాడే వారిని మరింత ప్రోత్సహించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఇలా మానవత్వం చాటుకుంటున్న వారికి ఇప్పటివరకు ప్రభుత్వం రూ.5,000 ప్రోత్సాహకాన్ని అందిస్తున్నది. దీనిని ఐదింతలు పెంచి రూ.25 వేలు ఇవ్వాలని నిర్ణయించినట్టు కేంద్ర రోడ్డు రవాణాశాఖ మంత్రి నితిన్ గడ్కరీ ప్రకటించారు. నాగ్‌పూర్‌లో రోడ్డు భద్రతకు సంబంధించి జరిగిన ఓ కార్యక్రమంలో నటుడు అనుపమ్ ఖేర్‌తో కలిసి గడ్కరీ పాల్గొన్నారు. జాతీయ, రాష్ట్ర రహదారులపై ప్రమాదాల్లో గాయపడిన వారికి మొదటి ఏడు రోజులు చికిత్స అందించేందుకు అయ్యే ఖర్చును రూ.1.5 లక్షల వరకు ప్రభుత్వం భరించనున్నట్టు గడ్కరీ చెప్పారు.

కర్ణాటక సర్కారుకు కాంట్రాక్టర్ల అల్టిమేటం

వారంలో బిల్లులు చెల్లించకుంటే ధర్నాలు

బెంగళూరు: తక్షణమే తమ పెండింగ్ బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేస్తూ కర్ణాటక కాంట్రాక్టర్ల సంఘం ఏడుగురు రాష్ట్ర మంత్రులకు లేఖ రాసింది. పెండింగ్ బిల్లులు రూ.32 వేల కోట్లకు చేరుకున్నాయని, సీనియారిటీ ప్రకారం బిల్లుల చెల్లింపు జరగడం లేదని ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్, మంత్రులు ప్రియాంక్ ఖర్గే, హెచ్‌సి మహదేవప్ప, జమీర్ అహ్మద్ ఖాన్, ఎన్‌ఎస్ బోసరాజు, దినేష్ గుండూరావు, రహీం ఖాన్‌లను ఉద్దేశించి రాసిన లేఖలో సంఘం ఆరోపించింది. పెండింగ్ బిల్లులలో రూ.14,000 కోట్లు నీటి పారుదల శాఖకు చెందినవే ఉన్నాయని తెలిపింది. వారం రోజుల్లో బకాయిలు చెల్లించకపోతే ఈ విషయాన్ని ముఖ్యమంత్రి సిద్ధరామయ్య దృష్టికి తీసుకెళ్లడమేగాక పెద్ద ఎత్తున నిరసనలు చేపడతామని సంఘం హెచ్చరించింది. కమీషన్లు ముట్టచెప్పిన తర్వాతే కాంట్రాక్టులు మంజూరవుతున్నాయని సంఘం తాత్కాలిక అధ్యక్షుడు జగన్నాథ్ షెగ్‌జీ ఆరోపించారు. మంత్రుల కన్నా ఎమ్మెల్యేలే కాంట్రాక్టు పనులలో ఎక్కువగా అవినీతికి పాల్పడుతున్నారని ఆయన ఆరోపించారు.

అటు చర్చలు.. ఇటు కవాతు

సరిహద్దులో సైనిక సామర్థ్య ప్రదర్శనకు చైనా ఆరాటం

న్యూఢిల్లీ, జనవరి 13: ఒకవైపు సరిహద్దులో ఉద్రిక్తతలు తగ్గించేందుకు భారత్‌తో చర్చలు జరుపుతూనే మరోవైపు సైనిక సామర్థ్యాన్ని ప్రదర్శించేందుకు చైనా తహతహలాడుతున్నది. వాస్తవాధీన రేఖ(ఎల్‌ఏసీ) వెంట లద్దాఖ్ సమీపంలో చైనా సైనిక సామర్థ్య ప్రదర్శన, కవాతు నిర్వహించిన విషయం వెలుగులోకి వచ్చింది. ఇందులో భాగంగా ఎలాంటి ఉపరితలం పైనైనా నడిచే యుద్ధ వాహనాలు, మానవ రహిత వ్యవస్థలు, డ్రోన్లు వంటి అత్యాధునిక యుద్ధ సాంకేతికతను ప్రదర్శించింది. ముఖ్యంగా ఎత్తయిన, కఠినమైన లద్దాఖ్ ప్రాంతంలోకి సైనిక రవాణా వ్యవస్థను మెరుగు పరుచుకునే దిశగా ఈ ప్రదర్శన నిర్వహించినట్టు తెలుస్తున్నది.

సరిహద్దుల్లో స్థిరంగా పరిస్థితి: ఆర్మీ చీఫ్

వాస్తవాధీన రేఖ వద్ద పరిస్థితి సున్నితంగా ఉన్నప్పటికీ స్థిరంగానే ఉందని భారత ఆర్మీ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేది తెలిపారు. సోమవారం ఢిల్లీలో ఆయన వార్షిక ప్రెస్‌మీట్ నిర్వహించారు. ఎల్‌ఏసీ వద్ద భారత సైన్యం మొహరింపులు సమతౌల్యంతో కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. మరోవైపు జమ్ము కశ్మీర్‌లో పరిస్థితి నియంత్రణలో ఉందన్నారు.

అమెరికా చరిత్రలోనే ఘోర విపత్తు

24కు పెరిగిన కార్చిచ్చు మృతుల సంఖ్య

లాస్ ఏంజెల్స్: అమెరికా చరిత్రలో అత్యంత ఘోర విపత్తుగా భావిస్తున్న లాస్ ఏంజెల్స్ కార్చిచ్చు ఇంకా కొనసాగుతున్నది. వేలాది ఇండ్లను ధ్వంసం చేసి, 24 మంది మృతికి కారణమైన ఈ దావానలాన్ని నియంత్రించడానికి అగ్నిమాపక సిబ్బంది ఆదివారం ఎంతో శ్రమించారు. ఇప్పటికీ 16 మంది జాడ తెలియడం లేదని, ఈ సంఖ్య మరింత పెరిగే అవకా